www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 01 సెప్టెంబర్ 2025 5

పశ్చిమ గోదావరి

వినాయక ఊరేగింపులో అపశృతి

ట్రాక్టర్ దూసుకెళ్లి నలుగురు దుర్మరణం

వార్త మెయిన్‌లో..

బీమా భరోసా కరువు..!

- కార్పొరేట్లకు పెద్ద పీట.. సామాన్యుల పట్ల నిర్లక్ష్యం
- ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడుతున్న కుటుంబాలు
- ఏడాదిలో మూడు వేల మందికిపైగా మృతి చెందినట్లు అంచనా
- విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పామాయిల్ కార్మికులే 18 మంది
- మేనిఫెస్టోలో పెట్టినా అమలు నోచుకోని చంద్రన్న బీమా పథకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కార్పొరేట్లకు పెద్దపీట వేస్తూ వందల, వేల ఎకరాల భూములను కట్టబెడుతూ ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం.. సామాన్యులకు అందించే బీమా పథకాన్ని మాత్రం అమలు చేయని పరిస్థితి నెలకొంది. అధికారంలోకొస్తే ఏడాది దాటినా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన చంద్రన్న బీమా పథకం అమలుకు నోచుకోలేదు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన గడిచిన ఏడాదిలో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. బీమా సాయం అందే పరిస్థితి లేకపోవడంతో ఆ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో విలవిల్లాడుతున్నాయి. ఇల్లు గడవడమే కష్టంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా పథకాన్ని అమలు చేసింది. సాధారణ మరణం అయితే రూ.లక్ష, ప్రమాద మరణమైతే రూ.ఐదు లక్షల చొప్పున ఆ కుటుంబానికి బీమా పథకం కింద ఆర్థిక సాయం అందేది. 2021-22లో ఏలూరు జిల్లాలో 1,500 కుటుంబాలకు, 2022-23లో 1,610 కుటుంబాలకు, 2023-24లో 1,149 కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా కింద ఆర్థిక సాయం అందింది. పశ్చిమగోదావరి జిల్లాలో అదే స్థాయిలో బీమా సొమ్ము అందిన పరిస్థితి ఉంది. గత లెక్కల ప్రకారం చూస్తే ఏడాదికి రెండు జిల్లాల్లో మూడు వేల వరకూ మరణాలు సంభవిస్తున్నాయి. సామాన్య కుటుంబాలకు

బీమా ఎంతగానో అండగా ఉండేది. 2014-19 మధ్యలో చంద్రన్న బీమా పథకం కింద సాయం అందించిన పరిస్థితి ఉంది. 2024లో జరిగిన ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే చంద్రన్న బీమా పథకం అమల్లోకి తెస్తామని, సాధారణ మరణాలకు రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణాలకు రూ.పది లక్షలు ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో పెట్టింది. కూటమి అధికారంలోకొచ్చి 15 నెలలు అవుతోంది. ఇప్పటి వరకూ చంద్రన్న బీమా పథకం అమలు చేయలేదు. కార్పొరేట్లకు భూములు కట్టబెట్టడంలో ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ సామాన్య కుటుంబాలకు అండగా ఉండే బీమా పథకం అమలులో మాత్రం లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య కుటుంబాల్లో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి పిల్లలను చదివించుకోలేక మధ్యలోనే చదువును ఆపేస్తున్న పరిస్థితి ఉంది. చంద్రన్న బీమా అమలు చేసి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందిస్తే ఆయా కుటుంబాలకు కొంత ఊరట దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వం మాత్రం అటువైపు ఏమాత్రం ఆలోచించకుండా ముందుకు సాగుతోంది. గడిచిన 15 నెలల కాలంలో విద్యుత్ షాక్ గురై ఏలూరు జిల్లాలో 18 మంది పామాయిల్ కార్మికులు చనిపోయారు. ఆయా కుటుంబాలకు కనీస ఆర్థిక సాయం సైతం అందలేదు. కుటుంబాలను పోషించే వ్యక్తి చనిపోవడంతో ఆయా కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విద్యుత్ సంస్థ నుంచి సైతం వారికి ఎటువంటి సాయమూ అందని దుస్థితి. సామాన్యులకు అండగా నిలిచే బీమా పథకం అమలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంపై జనాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు బీమా పథకం అమలు కోసం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి తమకు ఆర్థిక సాయం అందేలా చూడాలని అర్థిస్తున్నారు. ప్రభుత్వం ఇంకా చంద్రన్న బీమా పథకం అమలు చేయలేదని అధికారులు వెనక్కి తిప్పి పంపుతున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ బీమా పథకాన్ని అమలు చేసింది. దీంతో బాధితులు సంబంధిత అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. చంద్రన్న బీమా పథకం వెంటనే అమలు చేసి సామాన్య కుటుంబాలకు అండగా నిలవాలని జనం కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు సైతం చంద్రన్న బీమా అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జనం కోరుతున్నారు.

కుల మతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలి

కలెక్టర్, పీస్ కమిటీ ఛైర్‌పర్సన్ చదలవాడ నాగరాణి

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతృత్వంతో స్నేహపూర్వక వాతావరణంలో పర్వదినాలను అంతా కలిసికట్టుగా నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్, పీస్ కమిటీ ఛైర్మన్ నాగరాణి అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ప్రశాంతమైనదిగా మంచి పేరు ఉందని, ఇక ముందు కూడా ఇదే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. పండుగలను కుల, మతాలకు అతీతంగా స్నేహభావంతో అంతా కలిసికట్టుగా జరుపుకోవాలని కోరారు. ప్రస్తుతం వినాయక విగ్రహాల నిమజ్జనలు జరుగుతున్నాయని, ప్రశాంత వాతావరణంలో వాటిని పూర్తి చేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో డిజె సౌండ్ సిస్టమ్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఊరేగింపు సమయంలో హాస్పిటల్స్, మసీదుల వద్ద చాలాతక్కువ సౌండ్‌తో మాత్రమే ఊరేగింపులు సాగాలన్నారు. జిల్లా ఎస్‌పి, పీస్ కమిటీ వైస్ ఛైర్మన్ అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ నిమజ్జనం ఊరేగింపు సమయంలో ఐదు, పది నిమిషాలు ట్రాఫిక్ అంతరాయం వచ్చినా సహకరించాలని, చిన్న, చిన్న సమస్యలను పెద్దవిగా చేయొద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్, రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక ఉత్సవాల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో ఇప్పటికే రెండు దఫాలుగా సమావేశాలను నిర్వహించామన్నారు. అంతా సమన్వయంతో నిమజ్జనాలను పూర్తి చేయాలన్నారు. జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పర్వదినాలను నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేశామన్నారు. నిమజ్జనాలను సూచించిన ప్రాంతాల్లోనే చేయాలని, అక్కడ మాత్రమే బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒలు దాసి రాజు, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, డిఎస్‌పిలు జైసూర్య, శ్రీవేద, డి.విశ్వనాథ్, డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్‌వి.ప్రసాద్‌రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ జి.గీతాబాయి, భీమవరం మున్సిపాలిటీ సహాయ కమిషనర్ రాంబాబు, జిల్లా దేవాదాయ శాఖ అధికారి, వివిధ పార్టీల ప్రతినిధులు, వివిధ మతాల పెద్దలు, ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మానవత సేవలు వెలకట్టలేనివి : కలెక్టర్ నాగరాణి

భీమవరం :వసుధ ఫౌండేషన్ ద్వారా మానవత విలువలతో కూడిన సేవలు అందిస్తుందని, ఆ సేవలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గరగపర్రులో ఆదివారం వసుధ వాత్సల్య కేంద్రం వద్ద వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 21 సేవా సంస్థలకు రూ.28 లక్షలను చెక్కుల రూపంలో అందించారు. అంతేకాకుండా 11 మంది రోగులకు రూ.2.50 లక్షల నగదు అందించారు. చదువులో ప్రతిభ కనబరిచిన 30 మంది పేద విద్యార్థులకు రూ.2.10 లక్షలను ఉపకార వేతనంగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఇలాంటి సేవలు పొందుతున్న విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు మాట్లాడుతూ కష్టపడి చదువుకునే వారికి మా ఫౌండేషన్ ద్వారా సహకారం అందించడానికి ముందుంటుందన్నారు.

అధికారంలో అలజడి..!

అధికారపక్షమైన కూటమిలో అలజడి నెలకొంది. అటు పశ్చిమలో కలెక్టరేట్ అంశం, టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మిపై సొంత పార్టీలోనే నిరసన గళం, ఏలూరు జిల్లాలో టిడిపి సమావేశంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని వ్యాఖ్యల కలకలం అధికార పార్టీలైన టిడిపి, జనసేనల్లో అలజడి నెలకొందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

కలెక్టరేట్ భవన నిర్మాణం ఎక్కడనేది పశ్చిమగోదావరి జిల్లాలో చర్చనీయాంశమైంది. పి-4 పద్ధతిలో ఉండి నియోజకవర్గ పరిధిలోని పెదఅమిరంలో నిర్మించడానికి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామ కృష్ణరాజు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఆయన బహిరంగంగానే ప్రకటించారు. ఇరిగేషన్ స్థలం అందుబాటులో ఉండటంతోపాటు భవనాల నిర్మాణానికి అయ్యే ఖర్చులో సగం దాతలు భరిస్తారని ఆయన చెప్పుకొస్తున్నారు. అదే క్రమంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రకటించినట్లుగానే మార్కెట్ యార్డులో కలెక్టరేట్ నిర్మించాలని వైసిపి, కాంగ్రెస్ కోరుతున్నాయి. అసలు కూటమి ప్రభుత్వం ఏం చేయదల్చుకుందో భీమవరం ఎంఎల్‌ఎ అంజిబాబు, జిల్లా మంత్రులు, కలెక్టర్ స్పష్టం చేయాలని సిపిఎం మొదటి నుంచి డిమాండ్ చేస్తోంది. గత వైసిపి ప్రభుత్వం మార్కెట్ యార్డులో 20 ఎకరాల స్థలాన్ని కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి కేటాయిస్తూ జిఒ జారీ చేసింది. అయితే తదుపరి అడుగులు ముందుకు పడలేదు. ఈలోపు ఎన్నికలు రావడంతో వైసిపి అధికారం కోల్పోయి కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో జిల్లాల విభజనలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. నాటి నుంచి నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని, గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని ఆందోళనలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే కలెక్టరేట్ భవనాలు ఉండి నియోజకవర్గ పరిధిలోని పెదఅమిరంలో నిర్మించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రతిపాదించడం, దానికి ఆ ప్రాంతంలో ఇరిగేషన్ స్థలం మూడున్నర ఎకరాలు ఉందని గుర్తించి, జిల్లా అధికారులు సైతం పరిశీలించడం చర్చనీయాంశమైంది. ఇటీవల శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు సైతం భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ భవనానికి మార్కెట్ యార్డులో స్థలం సరిపోదంటే తాడేరు రోడ్డులో టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద పూడ్చి సిద్ధంగా ఉన్న స్థలం 30 ఎకరాలు ఉందనే అంశాన్ని ఆయన తెరపైకి తీసుకొచ్చారు. వీటన్నింటిపై ఎంఎల్‌ఎ అంజిబాబు స్పందిస్తూ కలెక్టరేట్ భీమవరంలోనే ఉంటుందని, ఎక్కడికీ తరలిపోదని ప్రకటించారు. అయితే గొల్లవానితిప్ప రోడ్డులోనూ స్థలాల కోసం పరిశీలిస్తున్నామని తెలిపారు. మొత్తంగా జనసేనకు చెందిన పిఎసి ఛైర్మన్, భీమవరం ఎంఎల్‌ఎ అంజిబాబు కలెక్టరేట్ భీమవరంలోనే ఉంటుందంటుంటే, డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు

పెదఅమిరాన్ని అవసరమైతే భీమవరం పట్టణంలో కలిపేస్తామని, కలెక్టరేట్ మాత్రం పెదఅమిరంలోనే నిర్మించాలని పట్టుబట్టడం గమనార్హం. మొత్తంగా కలెక్టరేట్ అంశం జనసేన, టిడిపి మధ్య విబేధాలకు ఆజ్యం పోస్తుందా, లేక టీ కప్పులో తుపానులా సమసిపోతుందా అనేది వేచిచూడాలి. ఏదేమైనా ప్రజాభీష్టం కాకుండా ఎంఎల్‌ఎల అభిప్రాయం మేరకు కలెక్టరేట్ నిర్మాణం సాగనుందని ప్రస్తుత పరిణామాలు చెబుతున్నాయి. ఏదేమైనా నాడు ఎఎంసిలో కలెక్టరేట్ నిర్మాణం సాగిస్తే అక్కడికొచ్చే ప్రజలకు రవాణా సౌకర్యానికి పెద్దగా ఇబ్బంది ఉండదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఎఎంసికి సమీపంలోనే భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్, మరికొంచెం దూరంలోనే బస్ కాంప్లెక్స్ ఉండటంతో అక్కడ కలెక్టరేట్ నిర్మాణానికి ఎవరి నుంచి ఎటువంటి అభ్యంతరాలూ వ్యక్తం కాలేదు. తాజాగా పెదఅమిరం అంటే అది భీమవరం పట్టణానికి ఆనుకునే ఉన్నా బస్టాండ్‌కు సుమారు ఆరు కిలోమీటర్ల వరకూ వెళ్లాల్సి ఉంటుంది. కాళ్ల వైపు నుంచి వచ్చే వారు మినహా ఇటు పాలకొల్లు, అటు తణుకు, తాడేపల్లిగూడెం వైపుల నుంచి వచ్చే వారు కచ్చితంగా ప్రయివేటు వాహనాలు లేదా కాళ్ల వైపు వెళ్లే ఆర్‌టిసి బస్సులను ఆశ్రయించక తప్పదు. దానికి తోడు ఆ మార్గంలో ఎస్ఆర్‌కె ఇంజినీరింగ్ కళాశాల వరకూ ఇప్పటికే ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కలెక్టరేట్ నిర్మాణంతో ఈ సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉంది. ఏదేమైనా సిఎం, డిప్యూటీ సిఎం స్థాయిలోనే కలెక్టరేట్ నిర్మాణంపై స్పష్టత ఇస్తేగాని జనంలో నెలకొన్న గందరగోళం వీడే అవకాశం లేదు.

ఇక మాజీ ఎంపీ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తీరుపై వీరవాసరం మండలంలోని బిసి నేతలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఇక్కడ పార్టీలో గ్రూపు విబేధాలు పెరుగుతున్నాయనే ప్రచారం ఉంది. అదే సమయంలో మిత్రపక్షమైన జనసేనతోనూ అంతర్లీనంగా విబేధాలు పొడచూపుతున్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవుల విషయంలో ముందు ప్రకటించిన పేర్లను మార్చడమే దీనికి నిదర్శనమనే ప్రచారం సాగుతోంది. అక్కడి సీనియర్ నేతల్లో ఒకరైన సీతారామలక్ష్మిపైనే అసంతృప్తి గళమెత్తడంతో జిల్లాలోని మంత్రి, సీనియర్ నేతలు జోక్యం చేసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ఇక ఏలూరు జిల్లాలోనూ టిడిపి, జనసేన నేతల్లో అలజడి నెలకొంది. జిల్లా అధ్యక్ష పదవిపై చర్చించేందుకు ఇటీవల ఏలూరులో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు పదవులు పొంది పార్టీలో పెత్తనం సాగిస్తున్నారని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. అదేస్థాయిలో మంత్రి కొలుసు పార్థసారధి ధీటుగా సమాధానం ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే గన్ని వీరాంజనేయులు, ఇతర నేతలు జోక్యం చేసుకుని అంతా చంద్రబాబు నిర్ణయం ప్రకారమే జరుగుతున్నాయని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇది ఆ పార్టీలో అంతర్లీనంగా ఉన్న విబేధాలకు నిదర్శనమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుపై అవినీతి ఆరోపణలు ఆ పార్టీ నేతలను ఇరుకున పెట్టాయి. జనసేన ఎంఎల్‌ఎలు యువత కావడం, కొత్తవారు కావడంతో కొంత సమన్వయ సమస్యలు ఎదుర్కొంటున్నారనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. ఏదేమైనా అధికార పార్టీలైన టిడిపి, జనసేనల్లో అధికారం అలజడి సృష్టిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

- వివిఎస్‌వి.ప్రసాద్

వరద గోదావరి

నీట మునిగిన లంక భూములు
బిక్కుబిక్కుమంటున్న లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరికి వరద తాకిడి ఆదివారం మరింత పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి పెద్దఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతుండటంతో వశిష్ట గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. లంక గ్రామాల్లోని పంటలు నీట మునిగాయి. మండలంలో పుచ్చలంక, నకిడిలంక, రాయిలంకలు ముంపు బారిన పడ్డాయి. అయోధ్య లంకలో పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. రాకపోకలు నిలిచిపోవడంతో లంకల్లోని ప్రజలు నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికీ అవస్థలు తప్పడం లేదు. నీటి ప్రవాహం ఉధృతంగా మారడంతో నదిలో నాటు పడవల రాకపోకలపై అధికారులు నిషేధం విధించారు. ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో లంక గ్రామాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ జి.కనకరాజు, రెవెన్యూ అధికారులు లంక గ్రామాల్లో పర్యటిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివశిస్తున్న వారిని అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ విఆర్‌ఒలను అప్రమత్తం చేశారు.

కరుగోరుమిల్లి వద్ద నీట మునిగిన పుష్కర రేవు

కనకాయలంకలో పడవల్లో ప్రయాణిస్తున్న ప్రజలు

నీట మునిగిన లంక భూములు

గోదావరి ఉధృతికి మండలంలోని లంక భూములు నీట మునిగాయి. కరుగోరుమిల్లి, కోడేరు, భీమలాపురం పరిధిలో ఏటిగట్టు దిగువన ఉన్న లంక భూములు ముంపులో చిక్కుకున్నాయి. సుమారు మూడు అడుగులు మేర వరద నీరు చేరడంతో వివిధ రకాల పంటలు నీట మునిగాయి. కోడేరు శివారు ఉత్తరపాలెం లంక భూముల్లో వంగ, బెండ పంటలు సాగవుతున్నాయి. భీమలాపురం, కరుగోరుమిల్లి భూముల్లో కొబ్బరి, అరటి, కూరగాయ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అయోధ్యలంక, పుచ్చల్లంక, రాయిలంక ప్రాంతాల్లో వరద నీరు చేరిన భూముల్లో కూరగాయలు, తమలపాకు, మునగ వంటి పంటలను సాగు చేస్తున్నారు. పంట భూముల్లో వరద నీరు చేరడంతో ఆయా పంటలు దెబ్బతినే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు సురక్షిత ప్రాంతాలకు పశువులను తరలిస్తున్నారు. పెదమల్లంలోని మాసేనమ్మవారి ఆలయ ప్రాంగణం, పర్యాటక కేంద్రాన్ని వరద నీరు తాకింది.

యలమంచిలి: గోదావరి వరద ఉగ్రరూపం దాల్చడంతో లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం గ్రామాల ప్రజలు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చిన్నపాటి వరద సంభవించినా మండలంలో మొదటిగా మునిగిపోయేది కనకాయలంక కాజ్ వే, ఈ గ్రామం గోదావరి మధ్యలో ఉండటంతో దీనికి ఏకైక మార్గం కాజ్‌వే కావడంతో వరద వచ్చిన ప్రతిసారీ స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ గ్రామ ప్రజలు తాగునీరు, నిత్యావసరాలు తెచ్చుకోవాలన్నా.. పిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలైతే హాస్పిటల్‌కు వెళ్లాలన్నా నానావస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితులలో పనులను కూడా కోల్పోయిన స్థానిక ప్రజలకు ప్రభుత్వం తరపున నిత్యావసర సరుకులు, తాగునీరు, పాలు వంటివి అందించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు

కుక్కునూరు రూరల్: గోదావరికి వరద ఉధృతి ఆదివారం ఐదోరోజూ కొనసాగింది. భద్రాచలంలో ఆదివారం ఉదయం గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. అయితే సాయంత్రానికి కొంచెం తగ్గి 47.9 అడుగులకు చేరడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. భద్రాచలంలో గోదావరి నిలకడగా ఉన్నా మండలంలో వరద నిదానంగా పెరుగుతోంది. ఇప్పటికే 17 రోజులుగా గుండేటి వాగు కాజ్‌వే నీట మునగడంతో 12 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై కాజ్‌వే మునగడంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని వదులుతుండటంతో గోదావరికి మరో రెండు రోజులపాటు వరద ఉధృతి కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు శబరి ఉగ్రరూపం దాల్చడంతో గోదావరికి వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. దీంతో ముంపు మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు వేలేరుపాడు మండలంలోని పంటలు నీట మునిగి రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో రుద్రంకోట, తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము, కన్నాయిగుట్ట తదితర గ్రామాల్లో వరి, పత్తి చేలు వందల ఎకరాల్లో నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రుద్రంకోట నుంచి రేపాకగొమ్ము, వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో కాజ్‌వేలు మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎద్దువాగు కాజ్‌వే మునగడంతో కొత్తూరు, బోళ్లపల్లి, నాళ్లవరం , ఎడవల్లి, చిగురుమామిడి, కోయిదా, కట్కూరు తదితర 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమైన వారు బోట్లపై రాకపోకలు సాగిస్తున్నారు.

ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

సామాజిక విశ్లేషకులు డివివిఎస్.వర్మ

ప్రజాశక్తి - తణుకు

ప్రజాస్వామ్యానికి ప్రాణ ప్రదమైన, ఎన్నికల వ్యవస్థకు కీలకమైన ఓటర్ల జాబితాలను తారుమారు చేస్తూ ఓటు చోరీకి పాల్పడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టువంటిదని సామాజిక విశ్లేషకులు డివివిఎస్.వర్మ అన్నారు. ఆదివారం స్థానిక సురాజ్య భవనంలో ఎన్నికల కమిషన్-ఓటర్ల జాబితాలు (ఓటు చోరీ-నిజానిజాలు)పై చర్చాగోష్టి డివివిఎస్.వర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా 65 లక్షల మందిని తొలగించి ఓట్ల చోరీకి పాల్పడిందన్నారు. సవరించిన జాబితాలో ఇంటి నెంబర్లు, తల్లిదండ్రుల పేర్లు లేనివారు, చిన్న చిన్న నివాసాల్లో వందల సంఖ్యలో అనర్హమైన వారిని ఓటర్లుగా చేసిందని, తొలగించిన ఓట్ల నమోదును కష్టతరం చేసి పేదల, వలస కూలీల, మైనారిటీల ఓటు హక్కును తొలగించిందని విమర్శించారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ సంస్థ బిజెపికి జేబుసంస్థగా మారడం ఎన్నికల నిర్వహణకు మాయని మచ్చ అని అన్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను రూపొందించాలని కోరారు. తణుకు బార్ అసోసియేషన్ కార్యదర్శి చోడే గోపీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ల నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండి తీరాలని, ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించే విధంగా ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్చాగోష్టిలో సిపిఐ నాయకులు కోనాల భీమారావు, బొద్దాని నాగరాజు, సిపిఎం నాయకులు అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, కాంగ్రెస్ నాయకులు దిర్సిపో రామకృష్ణ, రామారావు, రామకృష్ణంరాజు, బిఎస్‌పి నాయకులు జి.మధు, సామాజిక న్యాయపోరాట సమితి నాయకులు గొల్లపల్లి అంబేద్కర్, పేరూరి మురళీకుమార్, విశ్రాంత ప్రిన్సిపల్ చల్లా హైమావతి, సంకు మనోరమ, డాక్టర్ రమేష్, డాక్టర్ రఘు, కౌరు వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వరరావు, సొంగా ప్రసాద్, ముస్లిం జెఎసి నాయకులు నూర్ అబ్దుల్ రెహమాన్, గౌస్‌ఖాన్, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివివిఎస్ వర్మ

'గణపవరం'ను పశ్చిమలోనే ఉంచాలి

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు అఖిలపక్షం వినతి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉంచాలని, ఏలూరు జిల్లాలో కలిపితే ప్రజలు ఇబ్బందులు పడతారని అఖిలపక్ష నేతలు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కోరారు. ఆదిఆవరం వారు డిప్యూటీ స్పీకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం గణపవరం మండల ప్రజలకు దగ్గరగా ఉంటుందని తెలిపారు. మండలాన్ని భీమవరంలోనే ఉంచాలని 25 గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, అఖిలపక్ష నేతలు పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజుకు వినతి అందిస్తున్న నేతలు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో మెంటేవారితోటలోని ట్రస్టు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బిపి, షుగర్, ఫిట్స్, పెరాలసిస్ బాధితులకు నిర్వహించిన శిబిరానికి ముఖ్య అతిథిగా వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట్రామరాజు పాల్గొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వసుధ ఫౌండేషన్ భీమవరం కోఆర్డినేటర్ అధ్యక్షతన జరిగిన సభలో వెంకట్రామరాజు మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో, జిల్లాలో, దేశవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత రెగ్యులర్ ఆసుపత్రి, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. డాక్టర్ వి.శ్రీనివాసరావు, దాట్ల కృషంరాజు, వాలంటీర్లకు, మెడికల్ రిప్స్‌కు అభినందనలు తెలిపారు. యల్లాప్రగడ సుబ్బారావు డయాగ్నస్టిక్ సెంటర్‌కు థైరాయిడ్, షుగర్ కల్చర్ మిషన్‌ను వసుధ ఫౌండేషన్ సహకారంతో అందజేయగా, దానిని వెంకట్రామరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంతెన కృష్ణంరాజు, మంతెన సీతారాం, బుద్ధరాజు వెంకటపతిరాజు, విజ్ఞాన కేంద్రం ట్రస్టు సెక్రటరీ జెఎన్‌వి.గోపాలన్, నిర్వాహకులు జి.రఫాయేలు, బి.చైతన్యప్రసాద్, యర్రా అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేసినవారికే గుర్తింపు

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి -భీమవరం

విధుల పట్ల నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగులకు నిరంతరం గుర్తింపు ఉంటుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన సిహెచ్.రవికుమార్‌ను కలెక్టరేట్‌లో శనివారం రాత్రి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డివిఆర్‌ఒ బి.శివన్నారాయణ రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒలు కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, దాసిరాజు, ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



వినోద్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

వినోద్‌కుమార్‌శర్మకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆచంట

దళిత నాయకులు నక్క వినోద్‌కుమార్‌శర్మకు అమెరికా హార్వెన్స్ యూనివర్సిటీ కాలిఫోర్నియా వారు డాక్టరేట్ అవార్డు ఇవ్వడం పట్ల దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కళ్యాణ మండపంలో నక్క వినోద్ కుమార్ శర్మను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ ఎస్‌సి నాయకులు, దైవ సేవకులు పారుల్లి ఏసురత్నం, పి.బాబూరావు, జేమ్స్, చింతపల్లి గానిరాజు, పారుపల్లి సుందర్‌పాల్, కోరం ప్రశాంత్, వర్ధనపు హరివర్ధనపు, కాసు బీర మధు, గంటా రమేష్, దబ్బా ప్రకాష్, కుసుమే సామేలు, రాపాక ఆనంద్, నాగేశ్వరరావు, గాంధీ, పొలుమురి రాజేష్, లక్ష్మణ్ కుమార్ రాజు, అంబటి ప్రసాద్ కోలాటి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

జిన్నూరులో వంతెన త్వరగా నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోడూరు

జిన్నూరులో కొత్త వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలని సిపిఎం తశాఖ కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి డిమాండ్ చేశారు. జిన్నూరులో చివటపు ఆంజనేయులు అధ్యక్షతన శాఖ సమావేశం నిర్వహించారు. ముందుగా సిపిఐ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపి నివాళలర్పించారు. ఈ సందర్భంగా జిన్నూరులో సమస్యలపై తీర్మానించారు. నరసింహమూర్తి మాట్లాడుతూ జిన్నూరులో అనేక సమస్యలు కోకొల్లలుగా పేరుకుపోయాయన్నారు. వాటిలో నరసాపురం వెళ్లే కాలువపై గత వైసిపి చేపట్టిన వంతెన నిర్మాణ పనులు ఇప్పటివరకు అసంతృప్తిగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం 15నెలలు గడుస్తున్నా కొంత మేర పనులు చేసి నిలిపివేసిందని, వెంటనే నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. పాత వంతెన ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. వెంటనే తాగునీరు కుళాయి పైపుల ద్వారా ప్రజలకు అందించాలన్నారు. వర్షాలు కురిస్తే నీరు వెళ్లే మార్గంలేక కాలనీల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. వెంటనే డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్, ట్రూ అప్ ఛార్జీలు తగ్గించాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాళాబత్తుల గాంధీ, చివటపు ఆంజనేయులు, తేతలి వెంకటేశ్వర్లు, ఎలుదుర్తి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడమే 'మానవత' లక్ష్యం

ప్రజాశక్తి - వీరవాసరం

కష్టకాలంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యంగా కొనసాగుతుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కె.వెంకటసూర్యనారాయణ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వీరవాసరం మండల నూతన శాఖ ఏర్పాటు కార్యక్రమం ఆదివారం తులసి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మంది ఈ సంస్థలో సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. దేశంలోనే అతిపెద్ద సేవా సంస్థగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కొనసాగుతుందన్నారు. ఇతర సేవా సంస్థలకు భిన్నంగా మానవత సంస్థ స్థానికంగా అవసరం ఉన్నవారికి సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం వీరవాసరం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. ప్రెసిడెంట్‌గా యరక రాజు సుబ్రహ్మణ్య రాజు, సెక్రటరీగా కోటిపల్లి బాబు, ట్రెజరరీగా గుల్లిపల్లి కిరణ్, మరి కొంతమంది సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మల్ల రాంబాబు, కె.వెంకట సుబ్బారావు, తాడేపల్లి మోహన్‌రావు, వినాయక, గోపీ, జానకిరామయ్య, వీరవల్లి చంద్రశేఖర్, రాయపల్లి వెంకట్, యరక రాజు హరిబాబు, అడ్డాల రాము, గుల్లిపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంతర్జాతీయంగా బాస్కెట్ బాల్ క్రీడకు వన్నె తెచ్చిన మార్టేరు బాస్కెట్‌బాల్ క్రీడా ప్రాంగణం సాక్షిగా రానున్న కాలంలో మరింత పేరు తెచ్చేవిధంగా నూతన కార్యవర్గ ప్రతినిధులు ఉండాలని ఆదివారం సాయంత్రం మార్టేరు రోటరీ క్లబ్ వేదికగా పడాల ప్రఫుల్ల రెడ్డి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ట్రస్ట్ నూతన కార్యవర్గం ఏర్పడింది. గౌరవ అధ్యక్షులు-1గా అల్లం బుల్లిరెడ్డి, గౌరవ అధ్యక్షులు-2గా అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, సూపర్‌వైజర్ ఆరిటి మనోహర్ ఆదిత్య డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి, అధ్యక్షులుగా గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, కార్యదర్శిగా అల్లం భాస్కర్ రెడ్డి, కోశాధికారిగా గొలుగూరి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా కడలి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా మల్లిడి ప్రసాద్ రెడ్డి, మెంబర్స్‌గా కర్రి వినాయక రెడ్డి, ద్వారంపూడి సోమి రెడ్డి, పడాల కృష్ణారెడ్డి, వి.రమణారావు, కొత్త సత్యనారాయణమూర్తి, మల్లుల సుధాకర్, మంద సురేష్ రెడ్డి, సకిలేటి శంకరం, తేతలి రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం

220 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

భీమవరం టౌన్ : కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు సరైన చికిత్సలు చేయించుకోవాలని కృష్ణబలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. భీమవరం నాలుగో వార్డు నరసయ్య అగ్రహారంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చైర్మన్ త్రిమూర్తులు ప్రారంభించి మాట్లాడారు. అనుభవజ్ఞులైన డాక్టర్లు అందుబాటులో ఉన్నారని, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం 220 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి శ్రీనివాస్, విన్నకోట వినాయక్, కొత్తపల్లి శ్రీనివాస్, దాసరి మాధవ, ముత్యాలపల్లి మౌళి, విన్నకోట చిన్న, దాసరి సునీల్, ములపర్తి శివకుమార్, మామాను శివ, వైద్యులు ఎస్.శ్రీహరి, కె.దివ్య, చిన్న శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నడపనవారిపాలెంలో ఫ్లెక్సీ వివాదం

ప్రజాశక్తి - వీరవాసరం

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ఊరేగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన ఒక ఫ్లెక్సీ రెండు సామాజిక తరగతుల మధ్య వివాదానికి కారణమైంది. వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నడపనవారిపాలెంలో రెండు సామాజిక తరగతుల వారు ఉదయం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గ్రామంలో ఒక సామాజిక తరగతికి చెందినవారు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని తొలగించాలని మరో సామాజిక తరగతి వారు కోరడంతో వివాదం ప్రారంభమైంది. ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన వారు దానిని తొలగించకపోవడంతో ఫ్లెక్సీ పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్న వారు దానిని తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన సామాజిక తరగతి వారిపై మరో సామాజిక తరగతి వారు దాడి చేయడంతో వారు తీవ్ర గాయాలవడంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడికి గురైన బాధితులు వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

తణుకు : మండలంలోని వేల్పూరు, మండపాక గ్రామాల్లో పేకాట స్థావరాలపై ఆదివారం దాడి చేసిన పోలీసులు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. తణుకు రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం. వేల్పూరులో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. మండపాకలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రైతులకు విస్తృత సేవలందించాలి

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ
పాలకోడేరు సొసైటీ ఛైర్మన్‌గా కొత్తపల్లి నాగరాజు ప్రమాణ స్వీకారం
సొసైటీ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలి
డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - భీమవరం

సహకార సంఘాల ద్వారా రైతులకు విస్తృత సేవలందించాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. పాలకోడేరు సొసైటీ ఛైర్మన్‌గా కొత్తపల్లి నాగరాజు, పర్సన్స్‌గా యర్ర అప్పారావు, పాలా నాగగంగాధర్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసి అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ కనకరాజు సూరి, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళి, బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీదేవి, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల రత్నం సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు, కమిటీ సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. ఛైర్మన్ నాగరాజు రైతులకు మరిన్ని సేవలందించాలని కోరారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ పాలకోడేరు సొసైటీకి ఎంతో ఘన చరిత్ర ఉందని తెలిపారు. దీనికి నాగరాజు ఛైర్మన్‌గా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. రైతులకు ఉన్నత సేవలందించాలన్నారు. సొసైటీ ఛైర్మన్ నాగరాజు మాట్లాడుతూ రఘురామ కృష్ణరాజు తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. గతంలో కూడా ఛైర్మన్‌గా చేసిన అనుభవం తనకు ఉందన్నారు. సకాలంలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులతోపాటు పెట్టుబడులకు అవసరమైన రుణాలను అందజేస్తామన్నారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి విచ్చేసిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పివిఎల్.నరసింహారాజు, డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కునాధరాజు మురళీకృష్ణరాజు, ఎఎంసి డైరెక్టర్ కమ్మిలి రాంబాబు, నాయకులు హేచరీ బాబు, సూర్యనారాయణరాజు, మోగల్లు బాబు, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు, కూటమి నాయకులు కార్యకర్తలు, తహశీల్దార్ ఎం.భారతి విజయలక్ష్మి, ఎంపిడిఒ వి.రెడ్డియ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నాగరాజును సత్కరిస్తున్న రఘురామ, తదితరులు

వెంప-మొగల్తూరు రోడ్డు పనులు పూర్తి చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వెంప నుంచి మొగల్తూరు వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలం రూరల్ శనివారం, వెంప, దుర్గాపురం, పల్లిపాలెం నుంచి తదితర గ్రామాలకు వెళ్లే ఆర్ఎంబి రోడ్డు నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ వెంప, దుర్గాపురం నుంచి మొగల్తూరు వెళ్లే ఆర్ఎంబి రోడ్డు మీదుగా వేలాదిమంది విద్యార్థులు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు నిత్యం పయనిస్తారని, ఈ రోడ్డు గోతులు పడి ఉండటం వల్ల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించాలని, రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధనపు దేవేంద్రుడు, పట్టిం గణపతి, బర్రె సత్యవతి, బొడ్డు సత్యవతి, బొడ్డు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

బీమా ప్రీమియంపై జిఎస్‌టి తొలగించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ ప్రజల ఆర్థిక భద్రత, సేవలో 69 ఏళ్లుగా జీవిత బీమా సంస్థ ఉందని ఎల్‌ఐసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు గరికిపాటి బాపయ్య శర్మ తెలిపారు. సెప్టెంబరు ఒకటో తేదీన బీమా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గడచిన 69 ఏళ్లుగా దేశ ప్రజలకు ఆర్థిక భద్రత, ప్రభుత్వాలకు లక్షల కోట్ల రూపాయలు చేయూత నిస్తూ ప్రభుత్వ రంగ అగ్రగామి ఆర్థిక సంస్థగా జీవిత బీమా సంస్థ అభివృద్ధి చెందిందని తెలిపారు. 69 ఏళ్ల పూర్తి చేసుకుని జాతి జనుల సేవలో అగ్రభాగాన ఎల్ఐసి నిలిచిందని పేర్కొన్నారు. 1956లో రూ.ఐదు కోట్ల పెట్టుబడితో ప్రారంభించిన ఎల్ఐసి ప్రస్తుతం రూ.54 లక్షల కోట్ల ఆస్తులతో ప్రపంచ స్థాయి బీమా సంస్థగా ఉందని తెలిపారు. బీమా ప్రీమియంపై జిఎస్‌టిని తొలగించాలని పేర్కొన్నారు. ఎల్ఐసిని మరింత పటిష్టంగా అభివృద్ధి చేసి, కాలానుగుణంగా ఉద్యోగుల భర్తీ, మౌలికసదుపాయాలు కల్పిస్తూ ప్రభుత్వం మరింతగా ప్రోత్సాహించాలని పేర్కొన్నారు.

అంజలికి ఉద్యోగ విరమణ సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

దేశంలో ఉన్నత విద్యాసంస్థల్లో ప్రభుత్వ సంస్థల్లో చదివిన వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయని మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ బాబ్జి చెప్పారు. పాలకొల్లు ఎస్‌కెపి మున్సిపల్ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయురాలు రంగిశెట్టి అంజలికుమారి ఉద్యోగ విరమణ సందర్భంగా లయన్స్ క్లబ్‌లో వీడ్కోలు సభలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాఠశాలలు, హైస్కూళ్ల ఆధునీకరణ చేసిన ప్రవేశాలు ఆశించినంత లేకపోవడం వల్ల ఆయన ఉపాధ్యాయ సంఘాలకు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెనుమాక రామ్మోహన్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు రాంజీకుమార్, కార్యదర్శి త్రినాథ్, వై.ప్రభాకర్‌శాస్త్రి, ఎంఇఒ గుమ్మళ్ల వీరాస్వామి, హైస్కూల్ హెచ్ఎం సాయిబాబా, పెచ్చెట్టి బాబు, జివి, తదితరులు మాట్లాడారు.

పశువుల దాణా పంపిణీ

యలమంచిలి : పాలకొల్లు నియోజకవర్గంలో లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక గ్రామాల్లో వరద ప్రభావంతో పశు గ్రాసం దొరకని పరిస్థితులు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వెళ్లాయి. దీంతో ఆయన వెంటనే కలెక్టర్, సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు ఉచితంగా పశువుల దాణాను అందించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం కనకాయలంక, పెదలంక గ్రామాల్లో 165 మంది రైతులకు సుమారు రూ.ఐదు లక్షల విలువైన 20 టన్నుల పశువుల దాణా ఉచితంగా అందించారు. ఆయా గ్రామాల సర్పంచులు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు, టిడిపి మండలాధ్యక్షులు మామిడి శెట్టి పెద్దిరాజు, ఆరిమిల్లి రామశ్రీనివాస్, కడలి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు

ఉత్కంఠంగా సాగుతున్న పోటీలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

11వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు భీమవరంలోని పెదమేరంలో ఉన్న వెస్ట్ బెర్రీ పాఠశాలలో అత్యంత వైభవంగా ఉత్సాహంగా ఉత్కంఠ భరితంగా జరిగాయి. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఎపిఐఐసి రాష్ట్ర ఛైర్మన్ మంత్రి రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందువల్ల మానసిక ప్రశాంతత శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహిస్తున్నాయని, ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని చెప్పారు. ఇక్కడ గెలిచిన క్రీడాకారులకు త్వరలో నేషనల్ ఉంటుందని అన్నారు.

పిఇటి, పీడీ పోస్టులకు ఎంపికైనవారికి అభినందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో డిఎస్‌సి పరీక్షల్లో క్రీడా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం శిక్షణ పొందిన 23 మంది అభ్యర్థుల్లో 17 మంది పోస్టులకు ఎంపికై రికార్డ్ సృష్టించారు. వారిలో 16 మంది పీడీ, ఒకరు పిఇటిగా ఎంపికయ్యారు. ఈ మేరకు పిఇటి, పీడీ పోస్టులకు ఎం.అశోక్‌కుమార్, బి.దుర్గారావు, ఎ.సందీప్‌కుమార్, జె.శాంతిరాజు, ఎస్.ఆదిత్యరెడ్డి, ఎస్.తేజకృష్ణారెడ్డి, బి.అరుణ్ తాతాజీ, కె.వెంకన్నబాబు, పి.కృష్ణ, వి.భాగ్యశ్రీ, ఎ.స్వాతి, పిఎల్.ప్రవల్లిక, ఎ.మధుర వల్లి, బి.సంధ్య, కె.స్వరూపరాణి, కె.శ్రీదేవి, కె.వీరమణికంఠరాజు పోస్టులకు ఖరారయ్యారు. కాగా వీరికి స్థానిక హై స్కూల్ పీడీ, జాతీయ క్రీడాకారులు కర్రి కృష్ణారెడ్డి నేతృత్వంలో కొడమంచిలి జిల్లా పరిషత్ హై స్కూల్ పీడీ ఎంఎస్ఎన్.చిరంజీవి, గుమ్ములూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పీడీ ఎ.అంజలి పూర్తి ఉచితంగా, సేవా భావంతో శిక్షణ ఇవ్వడం విశేషం. తమకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు, పరీక్షకు సిద్ధం అవడానికి అన్ని మెళకువలు నేర్పి, ఉద్యోగం సాధించడానికి సహకరించిన ముగ్గురు శిక్షకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



పిఇటి, పీడీ పోస్టులకు ఎంపికైనవారు

వెంకటస్వామికి సర్వేపల్లి జాతీయ ప్రతిభా పురస్కారం

పలువురి అభినందన

ప్రతిభా పురస్కారం అందుకున్న వెంకటస్వామి

ప్రజాశక్తి - పాలకొల్లు

దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికిచ్చే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ బూసి వెంకటస్వామి అందుకున్నారు. ఆదివారం గుంటూరులోని లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎస్‌పిఎల్‌టిఒ (సదరన్ ప్రయివేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో వెంకటస్వామికి అవార్డు ప్రదానం చేశారు. సభాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ముఖ్యఅతిథి సత్తెనపల్లి మాజీ ఎంఎల్ఎ యలమంచిలి ఆంజనేయులు, అపుస్మా డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ వి.కన్నామాష్టారు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న వెంకటస్వామిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తెలుగు సాహితీ, భాషాభిమానులు అభినందనలు తెలిపారు.

ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి : మానవత

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని, అప్పుడే సమాజం కళకళలాడుతుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా శాఖ కన్వీనర్, విశ్రాంత అధ్యాపకులు కొత్త సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం మార్టేరులోని మానవత సంస్థ కార్యాలయంలో అధ్యక్షులు శిరం విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా రాజకీయ, ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందిస్తున్న కవిటం నీటి సంఘం మాజీ అధ్యక్షులు మల్లిడి వెంకటరెడ్డి(సత్యవరం), నెగ్గిపూడి పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ అల్లం బాలసాయిరెడ్డిలను వారి సేవలకు గుర్తింపుగా సత్కరించారు. మానవత పూర్వ అధ్యక్షులు, జాతీయ క్రీడాకారులు కర్రి కృష్ణారెడ్డి ఇటీవల అందించిన శిక్షణతో ఎక్కువ మంది విద్యార్థులు క్రీడా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందేలా కృషి చేసినందుకు పలువురు అభినందించారు. సమాజంలో అవసరమైన అందరికీ మంచి సేవలందిస్తున్న అంబులెన్సు డ్రైవర్ గుబ్బల శ్రీనివాస్‌ను నెగ్గిపూడి మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ తరపున ప్రతినిధులు డాక్టర్ సాక రాజు, డాక్టర్ నక్కా నరేష్‌లు కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ బండి ప్రసాద్, ఎ.సత్యనారాయణ, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చీర్ల శ్రీనివాసరెడ్డి, రీజనల్ కమిటీ ఛైర్మన్ బాణాల శ్రీనివాస్, గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కర్రి వేణుబాబు, అల్లం భాస్కరరెడ్డి, చదువుల వెంకట నరేంద్ర, శ్రీనివాసుల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న ప్రముఖులు

శ్రీనివాసరాజు సేవలు ఎనలేనివి

బాలకృష్ణరాజు

ప్రజాశక్తి - ఉండి

గత 17 సంవత్సరాలుగా తమ కళాశాల అభివృద్ధికి, విద్యాబోధనకు, విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేసిన ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్, ఐటిఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు సేవలు ఎనలేనివని ఐఎంసి ఛైర్మన్ బాలకృష్ణరాజు అన్నారు. ఆదివారం శ్రీనివాసరాజు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న బాలకృష్ణరాజు మాట్లాడుతూ 2008లో ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌గా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాసరాజు అప్పట్లో పక్కనే ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం ఆక్రమణలో ఉన్న ఐటిఐ రెండు ఎకరాల భూమిని తిరిగి పొందేందుకు చూపించిన పోరాట పటిమ ఎనలేనిదన్నారు. చుట్టుపక్కల ఉన్న ప్రయివేట్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలకు దీటుగా ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రాన్ని నిలిపారన్నారు. నాటి నుంచి అంచలంచెలుగా కళాశాలను అభివృద్ధి చేసి నేడు జిల్లాలోనే బెస్ట్ కాలేజీగా నిలిపారని, ఆయన స్ఫూర్తితో త్వరలో వచ్చే ప్రిన్సిపల్ మరింతగా కాలేజీ ప్రతిష్టను పెంచాలని కోరారు. అనంతరం శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇన్నేళ్లుబాధ్యతలు నిర్వర్తించేందుకు తనకు సహకరించిన బాలకృష్ణరాజుకు ధన్యవాదాలు తెలిపారు. తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సుమారు 16 మంది ఉపాధ్యాయులను కళాశాలకు కేటాయించే విధంగా ప్రభుత్వంపై బాలకృష్ణరాజు ఒత్తిడి తెచ్చారని, ఆయన కృషికి నేడు విద్యార్థులు చదువుకునే ప్రతి ట్రేడ్‌కు ఒక నిపుణులు ఉన్నారని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ చేసినప్పటికీ కళాశాలకు తన అవసరం ఉంటే కళాశాల అభివృద్ధికి తన వంతు బాధ్యత నిర్వర్తిస్తానని వారు తెలిపారు. తనకు ఇంత ఘనంగా ఉద్యోగ విరమణ సభ ఏర్పాటు చేసిన తన తోటి ఉద్యోగులకు కళాశాల సిబ్బందికి విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సభలో పలు కాలేజీల ప్రిన్సిపల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలకృష్ణరాజు

పశ్చిమ డెల్టా సిస్టం పటిష్టతపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ చదరవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో డెల్టా సిస్టం పటిష్టం, చెత్త నిర్వహణకు అనువైన మార్గాలపై దృష్టి సారించేందుకు ఆలోచన చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణితో జిల్లాలో డెల్టా సిస్టం పటిష్టం, చెత్త నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై చెన్నై ఐఐటి ప్రముఖ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, పోలవరం ప్రాజెక్ట్ మాజీ సలహాదారు డాక్టర్ విఆర్.రాజు చర్చించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లా డెల్టా ప్రాంతంలో ప్రధాన కాలువలు, సాగునీటి డ్రెయిన్లు కలుషిత వ్యర్థాలతో నిండిపోవడం, ఆక్రమణలకు గురికావడం వంటి కారణాలతో కలుషితంగా మారడంతో పాటు సాగు, తాగునీటి ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. డాక్టర్ విఆర్.రాజు మాట్లాడుతూ జిల్లాలోని డెల్టా సిస్టం పునర్ వ్యవస్థీకరణ, డంపింగ్ నిర్వహణ అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జిల్లాలో డెల్టా సిస్టం ఆధునీకరణ, యనమదుర్రు డ్రెయిన్ ప్రక్షాళన, చెత్త నిర్వహణపై సమీక్షించిన అంశాలను సిఎం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు రఘు రామకృష్ణరాజు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం యాత్రికులతో సందడి నెలకొంది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ ఛైర్మన్ కాడలి మాణిక్యాలరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో దారిద్ర్య రేఖ దిగువనున్న పేద తరగతులకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 44 మంది బాధితులకు ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ రూ.23.81 లక్షల విలువైన చెక్కులను ఆదివారం కొమ్ముచిక్కాల ఆఫీసు కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

భోజనాలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రముఖ వ్యాపారవేత్త ఆధ్యాత్మిక వేత్త రాధాకృష్ణ దేవాలయ నిర్మాత కొత్త రాధాకృష్ణమూర్తి 84వ పుట్టినరోజు వేడుకలను ఆదివారం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వారి నివాసం వద్ద నిర్వహించారు. పేదలకు భోజనాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రాధాకృష్ణ నిరంతర శ్రమ జీవి అని, కష్టపడి పైకొచ్చి సంపాదించిన దానిలో ఎక్కువ శాతం ధన ధర్మాలు చేస్తూ వస్తున్నారన్నారు. రాధాకృష్ణ త్యాగరాజ భవనం అధ్యక్షులుగా, భీమవరం రైస్ మిల్లర్ల అధ్యక్షులుగా ఎనలేని సేవలందించారన్నారు. అనంతరం 70 మందికి భోజనాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎన్ఆర్ కళాశాల కోశాధికారి కొత్త శ్రీనివాస్, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డస్ట్ బిన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని రిటైర్డ్ ఐఐటి ప్రొఫెసర్ విఎస్ఎన్.రాజు అన్నారు. వేంపాడు గ్రామంలో బంగారమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు తడి, పొడి చెత్త డస్ట్ బిన్లు, జ్యూట్ బ్యాగ్‌లు ఆదివారం పంపిణీ చేశారు. సుమారు 200 డస్ట్ బిన్లు, 200 జ్యూట్ బ్యాగులు అందించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా పాటిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లల డాక్టర్ వేగేశ్న రామకృష్ణం రాజు, పల్లంరాజు, నాయకులు వీరమల్లు వేణు, పంచాయతీ కార్యదర్శి సుంకర వెంకటేష్, వెంకటేశ్వరరావు, ఇర్రింకి రెడ్డియ్య పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు :సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించే ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్‌అహ్మద్, ఆర్థో డాక్టర్ రాజేంద్ర తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పది మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. కాకరపర్తి సత్యవతి ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పాస్‌పోర్టు పోయినది

పాల చలపతిరావు, S/o.పాల బుల్లియ్య, డోర్‌నెం.1-82/2 రామాలయం దగ్గర, రామచంద్రాపురం పంచాయతీ, కొండేపూడి గ్రామం, పాలకోడేరు మండలం, ప.గో.జిల్లా. అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పాస్‌పోర్టు నెం.H6438719 నెంబరు గల ఒరిజినల్ పాస్‌పోర్టు ది.12-07-2025వ తేదీన నాస్వగ్రామం రామచంద్రాపురం నుండి వేంద్ర జిరాక్స్ సెంటర్‌కు పాస్‌పోర్టు జిరాక్స్ తీయించు నిమిత్తం నా యొక్క మోటారు సైకిల్‌పై వెళ్లుచుండగా దారిమధ్యలో నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు ఉన్న గల కవరు పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

పాల చలపతిరావు, S/o.బుల్లియ్య, డోర్‌నెం.1-82/2, రామాలయం దగ్గర, రామచంద్రపురం, కొండేపూడి, పాలకోడేరు మండలం, ప.గో.జిల్లా. సెల్:8985450030